మాత్రమూ యెన్నడూ చేయకు; కనీసం ప్రోత్స హించకు; అది క్షమించరాని నేరం; మాతృ మూర్తికి చేసిన ద్రోహంతో సమానం; నన్నడి గితే పార్టీకి పెట్టుకొనే ప్రాథమిక దరఖాస్తు ఫారంలోనే ఈ విధమైన ప్రతిజ్ఞ లేక ప్రమాణం యిరికించాలి. నేనే కనుక పార్టీ అధ్యక్షుణ్నయితే ఆ విధంగా ఒక ప్రమాణాన్ని దరఖాస్తు ఫారంలోనే పొందుపరుస్తాను. ఈ పార్టీ ఫిరాయింపు నిషేధిస్తూ ఓ శాసనం చేయా అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలనుకొంటు న్నాను;

"ఇంకా చెప్పేది సావధానంగా విను; పార్టీలు మార్చేవానిపై ప్రజలకు అంటే ఓట ర్లకు సదభిప్రాయం వుండదు; దురభిప్రాయం కలుగుతుంది. ప్రజలు అనగా ఓటర్లు నిన్ను అనుమానిస్తారు; ఆపైన అవమానిస్తారు; నీచంగా చూస్తారు; పురుగును చూసినట్లుగా విదిలించుకొంటారు. రేపు వాళ్ళింటికి వెళ్ళి ఓటివ్వమని అడిగితే—

"రేపొద్దున్న గెల్చాక మరలా పార్టీ ఫిరా యించవన్న గ్యారంటీ యేమిటి?" అని నీ మొహాన్నే అడిగేస్తారు. మొదటి గెంటినా ఆశ్చర్యపోనవసరంలేదు. నీలోని ఈ లోపాన్ని నీ ప్రత్యర్థులు ఆసరాగా తీసుకొని తమ ప్రచా రాన్ని సాగిస్తారు; పార్టీలు మార్చేవాణ్ని నమ్మి ఓటు వేసి గెలిపించి మిమ్మల్ని మీరు మోస గించుకోకండి; తద్వారా దేశానికి ద్రోహం చేయకండి; ఆ తర్వాత విచారించి లాభంలేదు; రాజకీయాల్లో నిలకడలేనివాడినీ, పార్టీలు మార్చే వాడినీ, రంగులు మార్చే వూసరవెల్లుల్నీ యెన్నుకొని మీరు సాధించేది ఏదీలేదు;" అని యింకా కొన్ని కల్పించి నీమీద దుష్ప్రచారం చేస్తారు.

కనుక ఓ తిరుమలా....!" అని యింకా ఏవేవో కొన్ని అధ్యాయాలు చదివి విన్పిం చారు ఆదినారాయణగారు ఆనాడు.

నిజానికి ఆయనకు తానెంతో ఋణపడి వున్నాడు. తననీ స్థితికి తెచ్చినవాడు ఆయనే.



పార్టీ మార్చమని అంతరాత్మ ప్రబోధం ఒకవైపు....గురువుగారి హితబోధ మరియొక వైపు. మధ్య నలిగిపోతూ జాగరణ చేశారు మంత్రి శ్రీ తి.తి రావుగారు. తెల తెలవారు తూండగా ఓ నిశ్చయానికి వచ్చారు. గుండెలను చీల్చుకొని అంతరాత్మను తన పిడికిటికి తీసు కొని పీక పిసికి దూరంగా పారేసారు. అంత రాత్మకు చావు లేదని యెంతోమంది చెప్పినా నమ్మలేదు. కానీ కళ్ళారా చూసాక నమ్మక తప్పిందిగాదు!

అంతరాత్మ లేచి నిలబడింది. మందహాసం చేస్తూ మూడడుగులు ముందుకు వేసింది. జాలి గానూ సానుభూతితోనూ చూసింది. అయినా ఖాతరు చేయలేదు రావుగారు. గురువుగారి అడుగుజాడలలోనే నడవాలని నిశ్చయించు కొన్నారు. మనసును సమాధాన పరచుకొనే ప్రయత్నంలో పడ్డారు. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.

అయ్యగారికి తెలివి వచ్చేసరికి రెండు బారలు పొద్దెక్కింది. నిద్ర లేవగానే ఎదురుగా వున్న టీపాయ్‌మీద ఆనాటి "ఈనాడు" కని పించింది. తీసి హెడ్డింగులు చదవటం మొద లెట్టారు.

మొదటి పేజీలోనే అడుగున వున్న హెడ్డింగును చూసి నిర్ఘాంతపోయారు.

"మాజీ మంత్రి శ్రీ అవకాశం ఆది నారాయణగారు అధికార పక్షంలో చేరిక!"

కళ్ళు బైర్లు కమ్మాయ్ తి. తి. రావు గారికి.

కళ్ళు నులపుకొని, చేతిని గిల్లుకొన్నారు. ఆ వార్త పూర్తిగా చదివారు. హతాశయు లయ్యారు.

దూరంగా నిలబడి తనను గమనిస్తూ మందహాసం చేస్తూన్న అంతరాత్మను చూస్తూ మరలా మంచంమీదికి ఒరిగిపోయారు.

అంతరాత్మ విజయగర్వంతో తిరిగి ఆ మాజీ మంత్రిగారిలో ప్రవేశించింది.

"కాకిలా కాదు; హంసలా కలకాలం జీవించు;" అంది. □



# బ్రహ్మపదార్థం

కప్పగంతుల మల్లికార్జునరావు

ముక్కూ మొహం కన్పించని ప్రతి రాయినీ రప్పనీ దేవుడేననుకొని దండాలు పెట్టేవాడు చిరంజీవి. చిన్నతనంలో అతనికి అదో హాబీగా తయారవటానికి తగిన కారణాలు లేకపోలేదు.

చిరంజీవి తండ్రి పౌరోహిత్యం చేసేవాడు. తల్లి మూసివాయనాలు పట్టుండేది. అవసర మైతే వంటలు చేసేది. ఎన్ని చేసినా ఆ ఇంట్లో దరిద్ర దేవత ఎప్పుడూ తాండవిస్తూనే వుండేది.

"దేనికయినా కాలం ఖర్మం కలిసిరావాలి. ఆ భగవంతుడికి మనమీద దయ కలగాలే కానీ సిరి తోసుకు రావటం ఎంతసేపు!"

సిరి తోసుకొచ్చే కాలం కోసమే చిరంజీవి దేవుళ్ళని ప్రార్థించటం అలవాటు చేసుకొ న్నాడు. కానీ ఆ కాలం ఎంతకూ రాదేం?

"ఇలా కన్పించిన రాయికీ రప్పకూ సాష్టాంగ దండ ప్రమాణాలు చేయటం 'రిడిక్యులస్'గా వుంటుంది చిరంజీవి. భారతీయులంటే విదేశీ యులకి అందుకేట అంత చులకన; దేడీ చెపుంటాడు" రుక్మిణి అలా మందలిస్తూ చిరంజీవి ధోరణిని కంట్రోల్ చేస్తుండేది.

రుక్మిణి పెద్ద ధనవంతుల బిడ్డేం కాదు. ఆమె తండ్రి ఆఫీసర్. జీపులు, నౌకర్లు వుండటంవల్ల వాళ్ళ కుటుంబం గొప్పహోదాలో దర్జాగా వున్నట్లు కన్పించేది. దానికి తోడు రుక్మిణి తండ్రి ఆ హోదాను మైంటైన్ చేసే వాడు. పిల్లల్ని కాన్వెంటులో చేర్చేడు. అప్పు డప్పుడూ వంట చేయటానికి చిరంజీవి తల్లిని పిలిపించేవాడు.

దేవుడిని నమ్ముకోవటంవల్ల చిరంజీవికి చిన్నమెత్తు వుపయోగం జరుగలేదు. సిరి తోసుకొచ్చేకాలం రానేలేదు. పైగా అందరు దేవుళ్ళకూ అన్నన్ని నమస్కారాలు పెట్టు కొనిపోయి పరీక్ష రాసొస్తే అది కాస్తా ఫెయిలయ్యాడు. మరునటిసారి దేవుడన్న వాడిని తల్చుకోనన్నా తల్చుకోకుండా పరీక్ష పాసయ్యాడు.

కాలేజీలో చేరేక చిరంజీవి ధోరణిమారింది. పచ్చి నాస్తికుడయ్యాడు. భగవంతుడిని తిట్టటం ఓ ఫేషన్ అయింది. హేతువాదం పేరిట చెలామణీ అవుతున్న నాస్తిక గ్రంథాలలోని సారాంశాన్ని అమ్మోనియంలా తలకెక్కించు కొన్నాడు. 'హేతువాది'నన్న బోర్డును మొహా నికి తగిలించుకొని పెడవాదనలు చేయటం, వుపన్యాసా లివ్వటం అలవాటయింది.

'ఇదేం హేతువాదనయ్యా దేవుడా! హేతు వాది మొదటి క్వాలిఫికేషన్ జిజ్ఞాస. హేతు వాదం ప్రశ్నలతో ప్రారంభమవుతుంది. దేవుడి విషయమే తీసుకో. దేవుడు అంటే ఏమిటి? ఆ భావనాస్వరూపం ఎలా రూపు దిద్దుకొంది? రాతిని చూసి భగవంతుడనుకోవటంలో గల అర్థ పరమార్థా లేమిటి? యిలా ఆలోచించ కుండా, భగవంతుడన్న భావనే మూర్ఖంగా కొట్టేయడం మూఢత్వంకాదూ? రాతిలో దేవు డున్నాడన్న వొక మూఢ విశ్వాసం నుంచి, అసలు దేవుడన్న కాన్సెప్టే తప్పనే మూఢ

విశ్వాసంలోకి పోవటం హేతువాదం అవుతుందా?'

'అయితే దేవుడున్నాడా? వుంటే కన్పించ దేం? వొకప్పుడు రాతి విగ్రహాలకు దణ్ణాలు పెట్టే నన్ను నువ్వే ఎగతాళి చేశావుగా!' అల వాటయిన పద్ధతిలో ఉద్రేకంగా అడిగేవాడు.

'దేవుడు లేడయ్యా! రాతి విగ్రహాలలో అసలు లేడు. నీ మనసులో భావనకు సింబల్స్ అవన్నీ. అసలు కాన్సెప్ట్ అర్థం చేసుకో కుండా గుడ్డిగా దణ్ణాలు పెట్టేవని ఎగతాళి చేసేను కాని దేవుడు అన్న భావన వెనుక వున్న తత్వాన్ని అర్థం చేసుకోవద్దన్నానా?'

రుక్మిణి మాటలు చిరంజీవికి అంతుపట్టేవి కాదు. అర్థం చేసుకోవాలన్న ప్రయత్నం చేయ టమూ చిరాకే. అతను అప్పటికే 'కమిటెడ్' హేతువాది అయిపోయాడు.

అయితే కాలేజీలో చదువు అతడిని ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిం చింది. రాజకీయాల్లోకి దిగేడు. అక్కడా రాణించలేదు.

ఈలోగా రుక్మిణి చదువులో ఎక్కొచ్చింది. అదే ఆమెపాలిటి శాపంగా పరిణమించింది. ఆమె సంపాదించుకొన్న యమ్మెస్సీ ఫస్టు క్లాసు డిగ్రీ ఆమె పెళ్ళికి ప్రతిబంధకమయింది.

తల్లి దండ్రులతో విసిగిపోయి కులాంతర వివాహం చేసుకోడానికి సిద్ధపడింది.

'అంతకాడికి నన్ను చేసుకోమంటే నేను చేసుకొనేవాడినిగా?'

రుక్మిణి అతడివైపు చురుగ్గా చూసింది. ఆలోచించి నెమ్మదిగా ఎగతాళిగా అంది

'మన మధ్య శాఖాభేదాలున్నాయిగా? వాటిని కాదనే ధైర్యం నీకు లేదనుకొన్నాను.'

చిరంజీవి భుజాలు తడుముకొన్నాడు. అహంకారం దెబ్బతింది. రోషంగా అన్నాడు

'ఏమిటి? శాఖలా గాడిద గుడ్డా? దేవుడినే కాదన్నవాడిని. హేతువాదిని. శాఖల్ని పట్టుకొని వేళ్ళాడతానని ఎలా అనుకొన్నావ్?'

"దేవుడిని ఎందుకు కాదన్నావ్? కోపం వచ్చి అలిగేవ్ - చిన్న పిల్లాడిలా. నువ్వు నమస్కారం పెట్టగానే అడిగినవన్నీ దేవు డన్నవాడుంటే నీకు యిచ్చెయ్యాలన్నది నీ తత్వం. అంతేకాని దేవుడంటే ఏమిటో, హేతువాద దృక్పథం ఏమిటో తెలుసుకోవాలని ఎన్నడు ప్రయత్నించావ్? అంత తెలివితేటలు, ధైర్యం వుంటే పెళ్ళి చేసుకోమని నువ్వే ఎన్నడో అడిగి వుండేవాడివి. పిరికివాళ్ళని, అప్రయోజకుల్ని నేను 'ప్రేమించలేను-గౌర వించలేను.'

ఆ తర్వాత యిద్దరి దోవలు వేరయ్యాయి. రుక్మిణికి పెళ్ళికి ముందే వుద్యోగం వచ్చింది. పెళ్ళి చేసుకొన్న కొద్ది రోజులకే భర్త ఏక్సి డెంట్‌లో చనిపోయాడు.

బ్రతకటానికి ఏ దోవా లేక, ఏ ఇండస్ట్రీ లోనూ కూలిపనిచేసే శక్తి లేక, పొట్ట చేతపట్టు కొని సినిమా పరిశ్రమను వెతుక్కుంటూ మద్రాసు చేరుకొన్నాడు చిరంజీవి.

* * *

తండ్రి నుంచి చిన్నప్పుడు వినికిడిగా నేర్చు కొన్న ఎంగిలి మంత్రం ముక్కలు నాలుగు, వర్జ్యాలు, వారాలు చూడటం, శుభా శుభాలకు శకునాలు చెప్పటం— యివే చిరంజీవిని ముందుగా సినిమా పరిశ్రమకు పరిచయం చేసేయి. అయితే అక్కడా పోటీనే. ఎక్క రాలేకపోయాడు.

ఆ తర్వాత సుడిగాలిలో పడి కొట్టుకుపోయే పులిస్తరాకులా పదేళ్ళపాటు సినిమారంగంలో కొట్టుకులాడేడు. బతకటానికి తంటాలుపడ్డాడు. అతను వేలుబెట్టని శాఖలేదు. ఎందులోనూ వో కాలన్నా పూర్తిగా మోపే అవకాశం రాలేదు. ఏ పనీ కడుపు నిండా అన్నం పెట్ట లేదు. అన్ని పనులూ ఆకలితో చంపకుండా అర్ధాకలితో బ్రతికించేవే! భగవంతుడిని మన సులో ఎన్నిసార్లు పొడిచి పొడిచి చంపేడో!

"నీకు పట్టిన శని త్వరలో వదులుతుంది. నువ్వు పట్టిందల్లా బంగారమవుతుంది" పది పైసల చిలక జోస్యం అది. అవుతేనేం! ఆ రెండు ముక్కలే అతడిని చాలాసార్లు బ్రతి కించేయి. రేపటిపైన ఆశను పెంచాయి.





చివరికి శని వదిలినట్లయింది. చిరంజీవి అసోసియేట్ డైరెక్టర్ అయ్యాడు. ఆహోదాలో పనిచేసిన అతని మొదటి సినిమా విజయ వంతం కావటంతో గుర్తింపు వచ్చింది. రెండు కాళ్ళను సినిమా రంగంలో మోపుకొనే అవ కాశం కలిగింది.

దాంతో అతనికి జ్యోతిష్యంమీద నమ్మకం పెరిగింది. భగవంతుడిపైన విశ్వాసం కలిగింది. కాని పైకి మాత్రం 'హేతువాది'నన్న బోర్డును చెరపలేదు.

అసోసియేట్-డైరెక్టరుగా పనిచేసిన నాలుగు సినిమాలు విజయవంతం కావడంతో అతనికి డైరెక్టర్‌గా ఛాన్స్ వచ్చింది.

అది తన జీవితంలో పెద్ద మలుపని అతనికి తెలుసు.

ఆ సినిమా విజయం, అపజయంపై తన భవిష్యత్తు ఆధారపడి వుంది.

ముహూర్తం రోజు ఉపవాసమున్నాడు. జపాలు చేసేడు. పూజను భక్తి విశ్వాసాలతో సిన్సియర్‌గా చేసేడు. పదిమంది జ్యోతిష్కు లను సంప్రదించి పెట్టిన ముహూర్తానికి సినిమా ప్రారంభించాడు.

ఆ సినిమాలో అన్నీ అవాస్తవికాలే. పర స్పర విరుద్ధ సంఘటనలు, సంభాషణలు. అయినా అతని అదృష్టం బాగుంది. ఆ సినిమా హిట్టయి కూర్చుంది. చిరంజీవి హిట్ సినిమా దర్శకుల జాబితాలోకి ఎక్కి కూర్చున్నాడు.

రెండో సినిమా కూడా సక్సెస్ కావటంతో గ్లామర్ పెరిగింది.

కులంలో పిల్లను పెద్దవాళ్ళు కుదిరిస్తే కట్నం తీసుకొని హాయిగా పెళ్ళి చేసుకొ న్నాడు.

తమాషా ఏమిటంటే అతని మూడో పిక్చర్ కుల వ్యత్యాసాలను ఖండించేది. కుల

వ్యత్యాసాలు సృష్టించిన భగవంతుడిని హీరోయిన్ నిలేసి ప్రశ్నలడిగే ఘట్టం జనం బుర్రలోకి బాగా ఎక్కింది. ఆ పిక్చర్ బంపర్ హిట్ కావడంలో అగ్రదర్శకుడయ్యాడు.

ఆ తర్వాత ఆరేళ్ళు అతను తీసిన సినిమా అల్లా డబ్బు సంపాదించింది. దర్శకుడి నుంచి అతను నిర్మాత కూడా అయ్యాడు. స్క్రీన్‌ప్లే తోపాటు కథ కూడా రాయటం మొదలు పెట్టేడు.

విజయాలు నెత్తిన వర్షించేకొద్దీ, ధనం అతని ఖాతాలోకి జమ అయ్యేకొద్దీ అతనికి మూఢ విశ్వాసాలు హెచ్చయ్యాయి. సెంటిమెంట్లు ప్రగాఢంగా మనసులో పాతుకు పొయ్యాయి.

వెంకటేశ్వరస్వామిని చూడందే కళ్ళు విప్పడు. శకునం చూసుకొని షూటింగ్‌కు కారులో బయలుదేర్తాడు. షూటింగ్ ఆరంభించే ముందు ఎవరూ తుమ్మటం యిత్యాది చెయ్యకుండా ముందే జాగ్రత్తలు తీసుకొంటాడు నిర్మాత. వొకవేళ పొరపాటున ఎవరయినా తుమ్మితే యిక ఆ వేళకి షూటింగు ఆగిపోయినట్టే.

పిక్చర్ పూర్తి కాగానే డబ్బాల్ని తిరుపతికి తీసుకెళ్ళి పూజలు చేయందే రిలీజ్ చెయ్యడు.

అయితే చిత్రం ఏమంటే అతను దర్శకత్వం వహించే ప్రతి సినిమాలోనూ భగవంతుడిని హీరోయిన్ తిట్టే ఘట్టం వొకటి తప్పనిసరిగా వుంటుంది. మూఢనమ్మకాలను ఏదోవిధంగా హేళన చేయకుండా సినిమా తీయడు.

"హేతువాది" అన్న ముద్ర అతని మొహం మీద చెరగలేదు. కాగా దానిని పనిగట్టుకొని ప్రచారం చేయించుకోవటం అతనికున్న సర్దాలలోకల్లో గొప్ప సర్దా.

ళ ళ ళ

వరుసగా రెండు సినిమాలు సూపర్ ఫెయిల్యూర్ కావడంతో చిరంజీవికి చింత పట్టుకొంది. కారణాలు అన్వేషించసాగాడు.

ఆ సినిమాలు మొదలు పెట్టిన ముహూర్తాలు బాగున్నాయి. శకునాల విషయంలో ఎక్కడా లోపం జరుగలేదు. డబ్బాలకు తిరపతిలో యధావిధిగా పూజలు జరిగేయి. మరి ఎక్కడొచ్చింది లోపం?

ఇన్వెస్టిగేషన్‌కి దూతల్ని పంపించాడు.

"గురువుగారూ! విజయవాడలో, ఆ పిక్చర్ రిలీజ్ అయిన సినిమా థియేటర్ల పేర్లకు సినిమా పేర్లకు శాస్త్రప్రకారం కుదరలేదు. హైదరాబాద్‌లోనేమో మొదటి టిక్కెట్ కొన్న వాడిది భస్మాసుర హస్తం."

పిక్చర్ మార్నింగ్ షోతో రిలీజ్ అవుతోంది. హైదరాబాద్‌లో వర్కింగ్‌డే అయినా, థియేటర్ ముందు జనం గుంపుగా వున్నారు. టిక్కెట్లకోసం తోసుకుంటున్నారు. ఎండలో చెమటలు కక్కుతూ తన్నుకొంటున్నారు. తన్నుకొంటూనే మధ్యలో సినిమాల్ని గురించి చిరంజీవిని గురించి చెప్పుకొంటున్నారు.

"ఈ పిక్చర్ కూడా తన్నిందంటే యిక చిరంజీవిగాడి పని గోవిందా!"

"వాడు నాస్తికుడట. అందుకే భగవంతుడికి కోపం వచ్చి...."

చిరంజీవి ఏజెంట్లు జనంలో రియేక్షన్‌ను రికార్డు చేసుకుంటున్నారు.

నిజానికి చిరంజీవికి తెలుసు ఆ సినిమా కూడా ఫెయిల్ అయితే ఫీల్డులో యిక నిలదొక్కుకోవటం కష్టం. ఫ్లాప్ డైరెక్టరన్న ముద్ర వేస్తారు. డిమేండ్ పోతుంది. క్రమంగా అందరూ మర్చిపోతారు.


అందుకే చిరంజీవి క్రితం రాత్రి అంతా వుపవాసమున్నాడు. తెల్లవారిం దగ్గరనుంచి జపం చేస్తున్నాడు.

అప్పటికే షో టైం మించిపోయింది. మరి రిలీజ్ చేసే ముహూర్తం అలా కుదిరింది.

చిరంజీవి భక్తితో గల్లాపెట్టెకు పూజ చేసేడు. మేనేజర్ గదిలో పటాలకు సాష్టాంగ దండ ప్రమాణాలు చేసేడు. మొదటి టిక్కెట్ తన చేతుల్తో అమ్మటానికి సిద్ధంగా వున్నాడు.

కానీ కొనటానికి రావల్సిన వ్యక్తి యింకా రాందే!





"ఏమండీ మేనేజర్‌గారూ, కొనేమనిషి కోసం యిప్పుడా కబురు చేయటం? ఎన్నాళ్ళయింది కబురు చేసి?"

"నేనూ చాలారోజు లయిందండీ కబురు చేసి. కానీ ఆమెగారు సినిమా చూడనంటున్నారుట!"

"శ్రీ! జాకెట్టో చీరో యిస్తానని ఆశ పెట్టక పోయారా?"

"ఆమెగారిని తీసుకురమ్మని కారిచ్చి పంపించానండీ."

"మీ రెళ్ళాల్సింది."

ఇంతలో ఆ ప్రేక్షకురాలి కోసం వెళ్ళిన కారు తిరిగి వచ్చింది. "ఆమె సినిమాకు రమ్మన్న ఆహ్వానాన్ని తిరస్కరించింది.

"పోనీ మరో మంచి హస్తవాసి వున్న ప్రేక్షకు...."

"నో—" చిరంజీవి కోపంగా అరిచాడు. "నా మొదటి సినిమాకు మొదటి టిక్కెట్ కొన్న ప్రేక్షకురాలే నా చేతిమీద గుండా టిక్కెట్ కొనాలీ రోజు. యింకెంత టైం వుంది?"

"పది నిముషాలు మాత్రమే."

"అయితే పదండి. ఆ ప్రేక్షకురాలిని నేను స్వయంగా ఆహ్వానించి పిల్చుకొస్తాను."

అలాంటి మూఢత్వం సినీమారంగంలో వారికి కొత్త కాదు. అంచేత ఎవరూ ఆశ్చర్య పోలేదు.

కారు ప్రేక్షకురాలి ఇంటి ముందు ఆగింది.

చిరంజీవి ఆమె దర్శనం కోసం తొందర పడుతున్నాడు. ఆమె అలస్యంచేసి బయటి కొచ్చింది.

"రుక్మిణీ! నువ్వా?"

రుక్మిణి పట్టుచీరె కట్టుకొని వుంది. జుట్టు ముడి వేసింది. పెద్దరికపు హుందా అణువణువునా కన్పిస్తోంది. బొట్టు లేకపోయినా మొహాన ఏదో వెలుగు!

సౌజ్ఞతోనే వందిమాగధుల్ని బయటకు పంపించేసేడు చిరంజీవి.

"నీ మొదటి సినిమాకు మొదటి టిక్కెట్ కొన్నది నేనే చిరంజీవీ! ఎందుకో తెల్సా? అంత పెద్ద నాస్తికుడివి, హేతువాదివి. ఎంత విప్లవాత్మకమైన భావాలతో సినిమా తీసేవో చూద్దామని వెళ్ళేను."

"ఆ సినిమా హిట్టయింది రుక్మిణీ! నీ చేతి చలవవల్లే నేనింత పెద్ద దర్శకుడినయ్యాను. నా కొత్త సినిమా యివాళ రిలీజ్ అవుతోంది. దీని మొదటి టిక్కెట్టూ నువ్వే కొనాలి."

"హేదువాదమంటే యిదేనా చిరంజీవీ!"


"ఆ చర్చలు తర్వాత చేసుకుందాం రుక్మిణీ! జనం టిక్కెట్ల కోసం చాలా సేపటినుంచి క్యూలో నిల్చుని వున్నారు. పైగా ముహూర్తం టైం...."

"నీ సినిమాలు నాలుగు చూచాక నాకు సినిమాలు చూడాలన్న వాంఛ చచ్చిపోయింది చిరంజీవీ. నువ్వు ఎన్ని కథలు తీసినా, ఎన్ని భావాలు చెప్పినా, అన్నీ వొక్క బ్రహ్మ పదార్థం చుట్టూ తిరుగుతాయి. ఆ బ్రహ్మ పదార్థం ఏమిటో నీకు న్నేను చెప్పక్కర్లేదు. డబ్బు. చిన్నప్పటినుంచీ నీ జీవితంలాగా, ఆలోచనా ధోరణిలాగా, నీ సినిమాల్లోనూ అస్పష్టత, అస్తవ్యస్తత కన్పిస్తుంది. ఐడోంట్ లైక్ హిపోక్రసీ అండ్ ఐ కెనాట్ టాలరేట్ యువర్ జిమ్నాస్టిక్స్."

చిరంజీవికి ఎడాపెడా చెంపదెబ్బలు కొట్టినట్లయింది. మాట్లాడలేకపోయాడు.

"ఆశకొద్దీ ముందు అస్తికత్వాన్ని నటించావు. వోడిపోయి నాస్తికుడివి అయ్యావ్. ముద్దుగా 'హేతువాది' వనిపిల్చుకొన్నావ్. భగవంతుడనేవాడున్నా నిన్నంతకన్నా చెడగొట్ట లేడని నీ ధీమా అప్పట్లో. కాగా నీ వుపన్యాసాలకు, తిట్లకు భయపడే పిరికివాడవుతే నీకు లంచంగా మేలు చేసినా చేయవచ్చునన్న ఆశ! కానీ యిప్పుడలా కాదు! సంపాదించిన డబ్బు, పేరు ఏ క్షణాన పోతాయోనన్న భయం. ఇంకా యింకా వాటిని పెంచుకోవాలన్న ఆశ! ఆ భయం ఆశలే ఆరాటాలే అన్ని మూఢ విశ్వాసాలకు మూలం చిరంజీవీ! ఎన్ని వుండి ఏం లాభం దర్శకుడా! నిజమైన విశ్వాసం శాంతికి బీజం. ఆ విశ్వాసమే భగవంతుడన్న భావన. అంతేకానీ ఆ బొమ్మలు, ముహూర్తాలు, మొదటి టిక్కెట్ ఎవరికమ్మాలన్న సెంటిమెంటు యివన్నీ భగవంతుడన్న భావనలో భాగాలు కాదు. యిప్పటికయినా సత్యాన్ని దర్శించు."






చిరంజీవి ఆమె మాటల్ని వినలేదు. అసలు వినబడలేదు.

"నా కోసం యీ సినిమా చూడు రుక్మిణీ" ప్రాధేయపడ్డాడు.

"నీ కోసమనే యీ సినిమాను చూడను చిరంజీవీ."

చిరంజీవి అటూ యిటూ చూచి చటుక్కున ఆమె చేతుల్ని పట్టుకొన్నాడు.

"చిన్నప్పటినుంచి నువ్వు చిత్రమైనదానివే. నేను అవునన్నది నువ్వు కాదనటం అలవాటు. నిన్ను నేను అర్థం చేసుకోలేను. నిన్ను బలవంతపెట్టి లాభం లేదు. కానీ ఒక్క రిక్వెస్టు. దీన్ని కూడా కాదనకు."

"ఏమిటది?"

"ఒక్క అర్ధరూపాయి యివ్వు."

"ఎందుకు?"

"ఆ ప్రశ్న అడగకుండా యివ్వవా?"

"ఆ ప్రశ్న వేసుకోవటం మనిషికి ఆరోగ్య లక్షణం. అదే హేతువాదం. అలాంటి ప్రశ్నలు వేసుకోకే యిలా తయారయ్యావ్ నువ్వు" అర్ధరూపాయి యిస్తూ అంది ఆమె.

అతను ఆమె మాటల్ని పట్టించుకోలేదు. అర్ధరూపాయిని కళ్ళకద్దుకున్నాడు. ఆమె గుప్పిట్లో ఓ చిన్న కాగితం ముక్కను కుక్కేశాడు.

"బోణీ అయింది. టిక్కెట్ కొన్నావు. సినిమా చూడటం చూడకపోవటం నీ యిష్టం. యింట్లో కూర్చునయినా సినిమా హిట్ కావాలని నీ యిష్టదైవాన్ని ప్రార్థించు" చిరంజీవి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

రుక్మిణి గుప్పిట తెరిచింది.

కొత్తగా రిలీజ్ అవుతున్న సినిమా మొదటి టిక్కెట్! ఎర్రటి ఆ కాగితం ముక్క కోసం వేలమంది దేశమంతటా ఎండలో సినిమాహాళ్ళ దగ్గర పడిగాపులు కాస్తుంటారు.

కానీ అది తన కాళ్ళదగ్గరికి నడిచివచ్చింది. దాని వెల అర్ధ రూపాయి.

ఎలా? ఎందుకు? దాని విలువ అంత దిగజారింది?

"సెంటిమెంటల్ నాన్సెన్స్" అంటూ టిక్కెట్‌ను చిన్న చిన్న ముక్కలుగా చించి చెత్తబుట్టలో పారేసింది రుక్మిణి. □